ఆరోగ్యం.. ఆహ్లాదం

మిద్దె పంటలపై నగర వాసుల మొగ్గు

డాబాలపై ఆకర్షణీయంగా మొక్కల ఏర్పాటు

పూలు, కాయగూరలు, ఔషధ మొక్కల పెంపకం

కాస్తో కూస్తో వ్యవసాయంపై అవగాహన ఉన్నవారు మాత్రమే పట్టణ ప్రాంతాల్లో మేడలపై పలు రకాల మొక్కలు పెంచడం వంటివి చేసేవారు. ఆ తర్వాత రకరకాల కాయగూరలు, ఆకు కూరలు వంటివి పెంచుకునేవారు. కాని ఇప్పుడు మిద్దె పంటలపై పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందుకు వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం లభిస్తుందని చెబుతున్నారు.





ఇంటి మేడపై అందంగా మొక్కల ఏర్పాటు



డ్రాగన్ ఫ్రూట్ మొక్క



పక్షుల కోసం నీరు, ఆహారం



ఏపుగా కాసిన టమాటా

గోపాలపట్నం: మిద్దెసాగుకు నగర వాసులు మొగ్గు చూపుతున్నారు. పర్యావరణంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో మొక్కల సంరక్షణ వైపు మళ్లుతున్నారు. దీని కోసం ఇంటి ఆవరణను సాగు క్షేత్రంగా మార్చేస్తున్నారు. పచ్చదనం పెంచే మొక్కలతో పాటు పండ్లు, కూరగాయల మొక్కలు పెంచుతున్నారు. ఇళ్లను నందన వనాలుగా మార్చుతున్నారు. ఫలసాయం చూసి సంబరపడుతున్నారు.

ఆకర్షణీయంగా ఫ్రేమ్‌లు

మొక్కలు పెంచడానికి ఫ్రేమ్‌లు ఆకర్షణీయంగా తయారు చేసి వాటిలో కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. ఇవి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

ప్రవృత్తిగా మొక్కల పెంపకం

కొత్తపాలెం ఆదర్శనగర్‌లో వేము రవి కుమార్ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నారు. ఆయన పోర్టు ఉద్యోగి. క్రోటన్స్, పూల మొక్కలు వంటివి పెంచడం అలవాటు... రానురానూ వాటిని అందంగా తీర్చిదిద్దే ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం వేలల్లో ఖర్చు చేశారు. మొక్కలు అందంగా పెరుగుతుంటే ఆఖర్చు తెలియ లేదు. హ్యాంగింగ్ క్రోటన్స్, వంటి మొక్కలతో పాటు పలు ఔషధ మొక్కలు కూడా పెంచుతున్నారు.

ఆదర్శనగర్‌లో...

జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ఆదర్శనగర్‌లో పలువురు మిద్దె పంటలు పండిస్తున్నారు. దీని కోసం డాబాలపై ప్రత్యేకంగా నిర్మాణాలు చేపట్టారు. సలాది శ్రీరామకృష్ణయ్య ఇంటి మేడపై సిమెంట్‌లో ప్రత్యేకంగా కుండీలు నిర్మించారు. వాటిల్లో టమాటా, వంకాయ (నాలుగు రకాలు) మొక్కలు నాటారు. మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్ వంటి చాలా పండ్ల మొక్కలు పెంచుతున్నారు. పక్షుల దాహార్తి తీర్చేలా నీటి తొట్టెలు, ఆహార గింజలు వేసే తొట్టెలు కూడా ఏర్పాటు చేశారు. తన మిత్రుడైన పూజారి శ్రీనివాసరావు స్ఫూర్తితో తాను మిద్దె పంటలు పండిస్తున్నానని తెలిపారు.





మొక్కల పెంపకం అంటే ఇష్టం

మొక్కలు పెంపకమంటే చాలా ఇష్టం. సొంత ఇల్లు కట్టుకున్న తర్వాత ఆ ఆసక్తి మరింత పెరిగింది. దానికో అందమైన రూపం సాకారమయింది. క్రోటన్స్ పూల మొక్కలతో పాటు కాయగూరల మొక్కలు పెంచుతున్నాను. ఔషధ మొక్కలకు కూడా తగిన ప్రాధాన్యం ఇస్తున్నాను. దీని వల్ల ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం లభిస్తుంది.

– వేము రవికుమార్, పోర్టు ఉద్యోగి, ఆదర్శనగర్

మిద్దె పంటలతో సంతృప్తి

మిద్దె పంటలు ఎంతో సంతృప్తినిస్తున్నాయి. నిత్యం బిజీగా ఉన్నా దీన్ని వ్యాపకంగా మార్చుకున్నాను. మిత్రులు అందించిన మొక్కలను సేంద్రియ ఎరువులతో సంరక్షిస్తున్నాను. అందుకే ఇవి బాగా ఏపుగా పెరుగుతున్నాయి. పండ్ల మొక్కలు కూడా పెంచడం మొదలు పెట్టాను. ప్రస్తుతం మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్ వంటి మొక్కలు ఫలాలు ఇవ్వబోతున్నాయి. ఇది ఎంతో సంతోషాన్ని ఇస్తోంది.

–సలాది శ్రీరామ కృష్ణయ్య, కొత్తపాలెం ఆదర్శనగర్



క్లుప్తంగా

షబ్నమ్‌కు అభినందనలు తెలిపిన శ్రీధర్



షబ్నమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సభ్యులు(ఫైల్)

గోపాలపట్నం: విశాఖ కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన ఘనత మహిళా క్రికెటర్ షబ్నమ్‌దేనని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. ఈ మేరకు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అండర్–19 ప్రపంచ కప్ గెలవడంలో షబ్నం కీలకపాత్ర పోషించిందని అన్నారు. విశాఖ వాసిగా ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. పోటీలకు వెళ్లే సమయంలో ఆమె తమ ఇంటికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిసిందని... ఇపుడు విజయం సాధించడం కుటుంబ సభ్యులకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆమె మరిన్ని విజయాలు సాధించాలని శ్రీధర్ ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



విద్యార్థులు ప్రదర్శించిన నమూనాను తిలకిస్తున్న కోరమాండల్ అధికారి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆలోచింపజేసింది. కోరమాండల్ సంస్థ సౌజన్యంతో జరిగిన కార్యక్రమాన్ని ఆ సంస్థ కెమికల్ ఇంజినీర్ కుమారేషన్ ప్రారంభించారు. సుమారు 100 మంది వివిధ తరగతుల విద్యార్థులు పాల్గొని వివిధ నమూనాల ద్వారా తమ విజ్ఞానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దీప్తి థామస్, పీటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పులు.. వేల గొంతులను జయప్రదం చేయండి



మాదిగ వెల్ఫేర్ సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

గోపాలపట్నం: ఎస్సీ వర్గీకరణతో పాటు మాదిగుల హక్కుల కోసం ఈ నెల 7న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో చేపడుతున్న లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాదిగ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు ఎస్. పైడిరాజు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 90వవార్డు ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాలులో సోమవారం సమావేశం నిర్వహించారు. మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.లక్ష డప్పుల కార్యక్రమానికి హాజరై మాదిగల ఐక్యత చాటుదామన్నారు. కార్యక్రమంలో కడితి సాధూరావు, జి. వెంకటేశ్వరరావు, రమేష్, కె. నాగరాజు, గోవింద్, అలజంగి శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

రైల్వే వందేళ్ల ప్రగతిలో కార్మికుల కృషి

మర్రిపాలెం: భారతీయ రైల్వే ఏర్పాటై వందేళ్లు పూర్తి కావడం చాలా ఆనందంగా ఉందని సీనియర్ డీఈఈ బి.షణ్ముఖరావు అన్నారు. ఈ మేరకు సోమవారం డీఈ సాహో, జనరల్ ఎస్ఎస్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో మర్రిపాలెం రైల్వే స్టేషన్ నుంచి ఎలక్ట్రికల్ లోకో షెడ్ వరకు సుమారు 500 మంది రైల్వే ఉద్యోగులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందేళ్ల ఈ ప్రయాణం, రైల్వే ప్రగతి వెనుక ప్రతి కార్మికుడి కష్టం దాగి ఉందన్నారు. మూల మహేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరాజునగర్‌లో చోరీ

సీతమ్మధార: దొండపర్తిలోని తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగిన ఘటనపై ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కరణం గోపీనాథ్ అనే వ్యక్తి దొండపర్తిలోని వెంకటరాజునగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. గత నెల 31న విజయనగరం జిల్లా ఎస్.కోటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ ఉండగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఫోన్ రావడంతో కంగారుగా ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో వెండి కంచం, కుందులు పోయినట్లు గమనించారు. వెంటనే 112 కాల్ చేసి సమాచారం అందించడంతో ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నియామక పత్రాల అందజేత

సింధియా: వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) సహకారంతో పోర్ట్ పరిసర ప్రాంతాల్లోని సుమారు 90 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత ఉపాధి నైపుణ్య శిక్షణ అందించింది.

అందులో భాగంగా రెండో బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ చేతులమీదుగా నియామక పత్రాలు అందించారు. వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఏడాదికి లక్షా 20 వేల మంది నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిరుద్యోగులకు శిక్షణ అందించేందుకు సెమ్స్ వంటి సంస్థల అవసరం ఎంతో ఉందన్నారు. పీజీసీబీ సంస్థ సీఈవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ రెండో బ్యాచ్‌లో 30 మంది అభ్యర్థులకు ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సెమ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సేతు మాధవన్ , పీజీసీబీ సీఎస్ఆర్ హెడ్ కుమారి శ్రీలక్ష్మి, ప్రాజెక్ట్ హెడ్ ప్రజీత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా గొడౌన్లు ఎలా నిర్మిస్తారు



అధికారులకు పరిస్థితి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా కాలుష్య కారక గొడౌన్లు ఎలా నిర్మించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ ప్రశ్నించారు. మింది, అక్కిరెడ్డిపాలెం, పంచవటీలకు కూతవేటు దూరంలో గ్రీన్ పెట్రో కోక్ నిల్వల గొడౌన్లు ఏర్పాటుతో భూ కాలుష్యంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రసాయన పదార్థాలు నిల్వ చేస్తున్న గొడౌన్ల వద్దకు సంబంధిత అధికారులతో కలిసి సోమవారం ఆయా గ్రామాల నాయకులు పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉండాల్సిన కాలువలను మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు కురిసేటప్పుడు పరిసర గ్రామాలు ముంపునకు గురవుతాయని అధికారులకు వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండా ఎలా అనుమతులు ఇచ్చారని అన్నారు. గతంలో జింక్ పరిశ్రమ వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, పరిశ్రమ మూతపడడంతో పరిసర గ్రామాలు ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఇప్పుడు గ్రీన్ పెట్రో కెమికల్స్ నిల్వల గొడౌన్ల నిర్మాణం వల్ల పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారి శాంతి స్వరూప్ భట్నాగర్‌కు సూచించారు. కార్యక్రమంలో పోవా అధ్యక్షుడు పి.చిన్నారావు, నాయకుడు గుంటూరు నర్సింహమూర్తి, లోకేష్ పాల్గొన్నారు.

వారి సాహితీ కృషి అనిర్వచనీయం



జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ కేంద్రీయ హిందీ సంస్థాన్, కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో 'తెలుగు జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీతల సాహితీ కృషి'పై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గాంధీ సెంటర్ అధ్యక్షుడు, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ఆచార్య వి. బాలమోహనదాస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, గౌరవ అతిథి ఆగ్రా సెంట్రల్ హిందీ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య సునీల్ కులకర్ణి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహనదాస్ తెలుగు కవిత్రయమైన విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ చేసిన సాహితీ కృషికి ఫలితంగా అత్యుత్తమ జ్ఞానపీఠ్ పురస్కారాలు వరించాయన్నారు. తెలుగు సాహితీ ఔన్నత్యాన్ని హిందీ వారికి అందించే ప్రయత్నంగా కేంద్రీయ హిందీ సంస్థాన్ తమ కళాశాలలో సదస్సు నిర్వహించడం గర్వకారణమని కో–ఆర్డినేటర్ ద్వితీయ భాషావిభాగాధ్యక్షుడు డాక్టర్ పీకే జయలక్ష్మి పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ జయలక్ష్మి రచించిన అభినందన గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య గంగాధర్ వనోడే, ఆర్.సుమలత, ఆచార్య జ్యోతి, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్ దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ భాస్కర సుధ, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ



వడ్లపూడి పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడికి చెందిన మానవత్వ చారిటబుల్ ట్రస్ట్ 7వ వార్షికోత్సవం సందర్భంగా వడ్లపూడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వసంత పంచమి సందర్భంగా గాజువాక మండల విద్యాశాఖాధికారులు బి.విశ్వనాథం, ఎం.సునీత ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మానవత్వ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జె.లక్ష్మికుమారి, ఉపాధ్యాయులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విశాఖకు మొండి చెయ్యి



గుల్లలపాలెం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విశాఖకు మొండి చెయ్యి చూపిందని సీపీఎం మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి ఆరోపించారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లపాలెం వద్ద సోమవారం విశాఖకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైల్వే జోన్ ఊసే లేదన్నారు. మెట్రో రైలు గురించి ప్రస్తావనే తీసుకురాలేదన్నారు. బడ్జెట్‌లో ఆంధ్రకు అన్యాయం జరుగుతుంటే రాష్ట్ర కూటమి పాలకులు ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదన్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి



కోక్‌ఓవెన్స్ విభాగాధిపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సోమవారం కోక్‌ఓవెన్స్, ఆర్.ఎం.హెచ్.పి, టీపీపీ, సింటర్ ప్లాంట్ విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి జోలికి రాబోమని అక్టోబర్ 2న ఆర్ఎల్‌సీ సమక్షంలో అంగీకరించి ఇప్పుడు దొడ్డిదారిన తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, మంత్రి రవి, ఉమ్మిడి అప్పారావు, శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు



సత్కార సభలో అతిథులతో జిల్లా ఐఎన్‌టీయూసీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు డీఎల్‌బీ కాలనీ శాంతినగర్‌లో నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు గొర్లె చందు ఆధ్వర్యంలో జాతీయ పోర్టు ఐఎన్‌టీయూసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జాతీయ ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ అధ్యక్షుడు అబుబక్కర్(మంగుళూర్), ప్రధాన కార్యదర్శి రాణా(కాండ్ల పోర్ట్)లను ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు అబుబక్కర్ మాట్లాడుతూ విశాఖ పోర్ట్ కార్మికుల సమస్యలపై చేస్తున్న అన్ని పోరాటాలకు తమ పూర్తి మద్దతు, జాతీయ కార్యవర్గంలోని సభ్యులకు మరింత ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నాగభాష్యం, ఈశ్వరరావు, యూనియన్ నాయకులు గురుప్రసాద్, వెంకటరావు, రమణ, సత్యనారాయణ, అప్పారావు, ఆశిష్, రాజు, తిరుపతిరావు, హేమంత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ విద్యార్థికి పారా అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం



ఆధవన్‌ను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె.ఆధవన్ 7వ ఏపీ స్టేట్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025లో షాట్‌పుట్ విభాగంలో కాంస్య పతకం గెలిచాడు. ఈ పోటీలు గుంటూరు జిల్లా మంగళగిరి గత రెండు రోజులుగా నిర్వహించారు. ఆధవన్‌కు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు అభినందనలు తెలిపారు. కాలేజీ నుంచి రూ.5,000 నగదు బహుమతి అందజేశారు. విద్యార్థికి ప్రోత్సాహం అందించిన ఏపీ స్టేట్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ రామస్వామికి ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

'బడ్జెట్‌లో దళితులకు అన్యాయం'

సీతంపేట: జనాభాలో 18 శాతం ఉన్న దళితులకు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ అన్నారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన దళితులకు బడ్జెట్‌లో రూ.81 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.46 వేల కోట్లు కేటాయించారన్నారు. ఎస్సీ కమిషన్‌కు గత బడ్జెట్‌లో రూ.71 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.41 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకానికి గత బడ్జెట్‌తో పోల్చితే రూ.50 కోట్లు కోత విధించారన్నారు. గత బడ్జెట్‌తో పోల్చుతూ దళితులకు కేటాయింపుల్లో ఉన్న వ్యత్యాసాన్ని వివరించే లేఖ విడుదల చేశారు. కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి మాట్లాడుతూ నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపు జరగలేదన్నారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి జి.రాంబాబు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థల్లో ప్రైవేటు పెట్టుబడులకు 100 శాతం అవకాశం కల్పించడం అంటే దళితులకు ఇన్సూరెన్స్ కంపెనీలో రిజర్వేషన్లు లేనట్టే అన్నారు. సమావేశంలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్బన్న, దళిత నాయకులు ఎస్.రాజులు, ఆర్.సత్యవతి పాల్గొన్నారు.